# ఫా న్సీ షా ప్

"ఫాన్సీషాప్" అదో తన మనస్సో అన్నట్టు యనిపించింది. మెట్లెక్కి కొట్లోకి వెళ్ళడంతోనే గభీరన్నకు. ఒకానొక తెల్లటి ఏంగ్లో ఇండియన్ పిల్లని ఒకానొక నల్లటి అరవ పిల్లని కనుగొన్నాడు. ఇద్దఱికీ వయస్సు వొక్కటే, వాలకం వొక్కటే, వొయ్యారం వొక్కటే—కానైతే ఒకామె గౌను తొడిగింది. మఱోఆమె చీర కట్టింది. ఆ తేడా తప్పిస్తే, జుత్తుయొక్క షాంపూనింగునుంచి, చేతులయొక్క గుత్తుల సొంపుదాకా, గుత్తుల సొంపునుంచి ఎత్తు మడమల జోళ్ళదాకా ఒకటే ఫాషన్. ఇద్దఱూ కవలలా అని అనిపించక మానదు. ఆ వెన్నుపట్టీలు చూచినా, ఆ నాదారు నడుములుమీద ఆధారపడియున్న వొడుదుడుకులు చూచినా.

"గుడుగుడుకుంచం. గుండారామం. పాములపట్టం పడగా రామం. కత్తెయ్యనా బద్దెయ్యనా ?" అని అన బుద్ధేస్తుంది ఏలాంటి వానికైనా. అయినా ఏ మాట తిన్నంగా అడగరుగా ఆడవాళ్ళను ? అందులోనూ అది ఫాన్సీషాపు ! ముందుగానే వాళ్ళని పలకరించాలనే నిసబు అక్కఱలేదు. నీవు ఆ కొట్టులో యున్న ఒక బొమ్మను చూస్తూవున్నట్టు, ఒకప్పైయో రిబ్బనో నాణెం కడుతూవున్నట్టు. ఒక చైర్లో కూర్చుంటూ వున్నట్టు ఎన్నైనా పోకిళ్లు పోవచ్చు. ఎంతకాలమైనా గడపవచ్చు. ఏ వస్తువూ కొనకుండా ఏమీ అనకుండా నేరుగా నీ దగ్గరకువచ్చి, అతి పొలైట్‌గా షాహుకారు వచ్చి, "ఏం కావాలండీ తమకు ? చాలా సేపట్నుంచి వెతుకుతూ వున్నట్టున్నారు. మా కొట్లో

లేని సరుకు ఈ ప్రపంచంలో లేదు " అని అనే పర్యంతం అక్కడే డేరా మేకులా వుండవచ్చు.

అయితే ఆ లేడీస్ అక్కడ వున్నంతసేపు కొట్టు అతడు తన్ను చూచే స్థితిలో వుండబోడు అని గ్రహించాడు కాస్సేప ట్లోనే గభీరన్న. " అబ్బీ ! " అన్నాడు. కొట్లోవాళ్ళందఱు గభీరన్నకేసి దృష్టిసారించారు. గభీరన్న వోబుష్కోటూ ఇతడూ కతక్ మనిపించాడు అంతమందిసీని.

" హల్లో గభీర్ ! గుడ్‌మార్నింగ్ " అన్నారు ఇద్దరు లేడీస్‌కూడా ! " గుడ్ మార్నింగ్, షాపింగ్ అయిందా ? " అని అడిగాడు వాళ్ళను గభీరన్న ఏ విధమైన ఇరుకూ తన హృదయంలో లేనివానికిమల్లే. " కొన్ని గంటలముందే అయి పోయింది " అన్నాది అరవ పిల్ల నవ్వుతూ. నల్లటి మొఖము మీద ఎఱ్ఱటి " కోరల్ " " లిప్సు " అదీ, లిప్‌స్టిక్ సొంపు లేండి అదంతా. " తెల్లాటి ఒక్కగంటే అయింది " అన్నాడు గభీరన్న రిస్ట్‌వాచ్ చూచుకొంటూ. " కొట్టిప్పు డెనిమిది గంట లయితేనేగాని తెరవనేరాదు మేము " అన్నాడు కొట్టన్న. " అట్లా అయితే ఒక అరగంట మన మిక్కడ వృథాపుచ్చాం అన్నమాట " అని రిచ్చపోయినట్టు తన గడియారం చూచు కొంది. " నే నిక్కడ 8-15 నుంచి వున్నాను " అన్నాడు గభీరన్న. " నీవూ మేమూ ఒకతూరి ఈ షాపులోకి దూరి వుండ వచ్చును " అంది ఏంగ్లో ఇండియన్ లేడీ.

యుద్ధం ముగిసిపోయినా ఈ తగులాటం తనకు తప్ప లేదురా బాబూ ! అని ఒకింత తలపోశాడు గభీరన్న. " ఏమిటి ఆలోచిస్తూ వున్నావు ? " అంది అరవపిల్ల. " ఏమీలేదు—ఏది వారి బిల్లు షాహుకార్ ! " అని షాహుకారునుండి బిల్లు తీసి

కొంటూ పదిరూపాయల నోటు తన జేబులోంచి తీసి ఇచ్చేశాడు. "ఇద్దఱు ముద్దియలు థాంక్సు చెబుతూ తిరిగి కలుసుకుంటాం గభీర్" అంటూ వెళ్ళిపోయినారు. ఆ ఆడవాళ్ళిద్దఱూ వెళ్ళి పోయినారు.

"ఆ ఆడవాళ్ళిద్దఱూ మీ కేమవుతారు!" అని అడిగాడు కొట్టన్న. "ఆ ప్రశ్న వేసేకన్న మీ కేం కావాలి? అని అడిగితే నా కాలం నీ కాలం మఱి వృధా కాదు" అన్నాడు కొంచెం ముఖం కుచించుకుని గొంతు చించుకొని గభీరన్న. "సారీ! తమకు ఏం కావాలో సెలవియ్యండి. సారీ! నిలబడిపోయారు. ఈ నుంచీని" అన్నాడు అతి భయభక్తులతో.

"నాకు బూట్‌లేస్ కావాలి" అని బూట్ చూపిస్తూ. "అదివఱకిట్టిది యీ మెట్లెక్కుతూ వుంటేనే ఫట్ మని తెగి పోయింది" అన్నాడు కూడాను. షాహుకారు "థాంక్సు! వెరీ గ్లాడ్! మా కొట్టు మెట్లు చాలా అదృష్టం చేసుకున్నాయి. పట్టు లేసులేనా తమరడుగుతూన్నది?" అన్నాడు సరుకు తీస్తూ. గభీరన్న "అవే" అని అంది పుచ్చుకు వంగి అమర్చుకుంటూ నేలబారు చూపు ఆ వెళ్ళిపోయిన స్త్రీరత్నాలకేసి తారాజువ్వలా వదిలాడు.

"నిండా బాగున్నాదండీ మీ బూట్సు కాలేస్" అని షాహుకార్ లేపేదాకా మేలుకోనేలేదు అతగాడు.

"మీ కొట్టుమెట్లు దిగడంలో తెగిపోకుండా వుండాలి" అంటూ టకటకా దిగేడు. ఆ స్త్రీ రత్నాలు ఆ ధ్వని కతనికేసి తుపాకి రవ్వల్లాంటి చూపులు వదిలేరు.

దాంతో గభీరన్న బూట్‌లేస్ అప్పుడు కొన్నదైనా ఫట్ ఫట్! కొట్టుమెట్లు పూర్తిగా దిగకుండానే గాన్‌ఫట్!